# పోషకాల లోపంతోనే దృష్టి సమస్యలు

- వాటిని సరి చేసేందుకే 'నయనజ్యోతి'
- కలెక్టర్ భారతీహోళికేరి

మెదక్‌జోన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతీహోళికేరి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పోషక పదార్థాల లోపంతోనే విద్యార్థుల్లో దృష్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ భారతీహోళికేరి పేర్కొన్నారు. వాటిని పరి ష్కరించేందుకే జిల్లాలో 'నయనజ్యోతి'ని ప్రారంభించామని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమంపై ఉపాధ్యాయు లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరగతి గదిలో వెనక వరుసలో కూర్చున్న విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఉన్నా బోర్డుపై ఉపాధ్యాయుడు రాసే అక్షరాలు సరిగా గుర్తించక చదువులో వెనకబడిపోతున్నారని అన్నారు. అలాంటి విద్యార్థులను గుర్తించి వారిలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు నయనజ్యోతి కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. జిల్లాలో ఆరు నుంచి పదో తరగతి చదివే సుమారు 50 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన అఖిల కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలే కాకుండా రక్త పరీక్షలు సైతం నిర్వహించాలని సూ చించారు. ప్రతి 200 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకంటే ఉపాధ్యాయుల దగ్గరే ఎక్కువ సమయం ఉంటారని, వారిని సొంత పిల్లలుగా భావించి పరీక్షలు చేయించాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ప్రా థమిక విద్యను బలోపేతం చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే అంకుర్ కార్యక్రమం ద్వా రా వంద పాఠశాలల్లో సులభతర బోధన పద్ధతులను ప్రవేశపెట్టామన్నారు. డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, డీపీఎం జగన్నాథరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ నీలకంఠం తదితరులు పాల్గొ న్నారు.